Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 333 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 14 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## నుదుటి సిందూరం తుడిచినవాని నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం : ప్రధాని మోదీ




**పంజాబ్ :** ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం.. మన సంప్రదాయం.. మన విధానమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మన సైన్యం చూపిన శక్తి సామర్థ్యాలు భావితరాలకు గొప్ప ప్రేరణ అని ఆయన అభివర్ణించారు. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ తాను సెల్యూట్ చేస్తున్నానన్నారు. వీర సైనికుల పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం.. ప్రపంచమంతా మార్మోగుతోందని ఆయన తెలిపారు. మంగళవారం పంజాబ్‌లోని అదంపూర్ ఎయిర్‌బేస్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా సైనికులతో ఆయన స్వయంగా మాట్లాడారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. మన సైన్యం చేపట్టిన ఈ పరాక్రమం.. భారత్ సామర్థ్యానికి ప్రతిరూపమని పేర్కొన్నారు. భారత్ చూపిన ఈ పరాక్రమం.. త్రివిధ దళాల త్రివేణీ సంగమమని ఆయన వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు భారత వాయుసేన తన సత్తా చాటిందంటూ సైనికులపై ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. యుద్ధ క్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశామని.. ఈ జయ జయ ద్వానాలు ప్రపంచమంతా విన్నదని ఆయన గుర్తు చేశారు. భారత్ మాతాకీ జై అనేది ప్రతీ పౌరుడి నినాదమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అణు బాంబు హెచ్చరికలను సైతం చిత్తు చేశామని చెప్పారు. దేశంలోని ప్రతీ పౌరుడూ గర్వపడేలా మీరు చేశారంటూ సైనికులను ఈ సందర్భంగా ప్రధాని మోదీ అభినందించారు. మీరందరూ చరిత్ర సృష్టించారంటూ సైనికులను ఆయన వెన్ను తట్టి ప్రోత్సహించారు. మీ కోసమే నేను ఇక్కడికి వచ్చానని చెప్పారు. వీరులను చూసినప్పుడు జీవితం ధన్యమవుతోందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాడి నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశామని ప్రధాని మోదీ తెలిపారు. మీరు గురిచూసిన కొట్టిన దెబ్బ శత్రు స్థావరాలు మట్టిలో కలిసిపోయాయన్నారు. భారత త్రివిధ దళాలు పాక్ సైన్యాన్ని మట్టి కరిపించాయని చెప్పారు. పాక్ సైన్యానికి స్పష్టమైన సందేశం ఇచ్చామన్నారు. పాక్‌లో ఎక్కడైనా ప్రశాంతంగా శ్వాస తీసుకునే అవకాశం లేకుండా చేశామని వివరించారు. మన డ్రోన్లు, మిస్సైల్స్ పాక్ భూభాగంలోకి.. చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించాయని తెలిపారు. ఇంకా చెప్పాలంటే.. పాక్ సైన్యానికి నిద్ర లేని పరిస్థితి సృష్టించామన్నారు. పాక్ భూభాగంలో ఏ స్థావరాన్ని అయినా.. గురి చూసి కొట్టగలమని నిరూపించామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ భారత్ ఆత్మ విశ్వాసాన్ని కొత్త ప్రమాణాలు లిఖించిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక మన స్థావరాలపై దాడి చేసేందుకు పాక్ ఎంతో ప్రయత్నించిందన్నారు. కానీ పాక్ విమానాలు, మిస్సైల్స్.. మన ముందు చిత్తైపోయాయన్నారు. భారత లక్ష్మణ రేఖ ఇప్పుడు ఎంతో సురక్షితమని పేర్కొన్నారు. మళ్లీ దాడి చేస్తే భారత్ గట్టిగా జవాబిస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. న్యూక్లియర్ బ్లాక్ మెయిల్‌ను భారత్ ఏ మాత్రం ఉపేక్షించదని స్పష్టం చేశారు. ఉగ్రవాదులు..వారి వెనుకున్నవారిని..భారత్ వేర్వేరుగా చూడదని ఆయన కుండబద్దలు కొట్టారు. కేవలం 15 నిమిషాల్లో సరిహద్దుల ఆవల శక్తులను భగ్నం చేశామని చెప్పారు. ఇదంతా ప్రొఫెషనల్ సామర్థ్యంతోనే సాధ్యమైందని ప్రధాని మోదీ తెలిపారు. భారత్ సైన్యం దాడితో శత్రువు డీలా పడిపోయిందన్నారు. ఎప్పుడు దాడి జరిగిందో కూడా కనిపెట్టలేక పోయిందని ప్రధాని మోదీ చెప్పారు. ఎంతో కచ్చితత్వంతో ఎంతో నైపుణ్యంతో చేసిన దాడి ఇదని ఆయన గుర్తు చేశారు. పౌర విమానాలను అడ్డు పెట్టుకుని పాక్ కుయుక్తులు పన్నిందని ప్రధాని మోదీ చెప్పారు.

## ఢిల్లీ ఏపీ భవన్ ఇష్యూ.. స్పందించిన సీఎం చంద్రబాబు



**ఢిల్లీ:** ఢిల్లీ ఏపీ భవన్‌లో బాలాజీ మందిరం కూల్చివేతను నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఢిల్లీ ఏపీ భవన్‌లో ఆక్రమణల తొలగింపు, ప్రార్థనా మందిరం తొలగింపు ప్రతిపాదన అంశంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు. రాష్ట్ర విభజనలో భాగంగా ఏపీ భవన్ స్థలాన్ని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు పంచుకున్నాయి. ఈ ప్రాంతంలో కొత్త భవనం నిర్మించేందుకు అవసరమైన చర్యలను ఏపీ యంత్రాంగం చేపట్టింది. ఏపీ భవన్ ప్రాంగణంలో 0.37 ఎకరాల్లో పలు ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు తేల్చారు. వాటి తొలగింపునకు సంప్రదింపుల ద్వారా, చట్టబద్ధంగా గత నెల నుంచి తీసుకున్న చర్యలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు అదే ప్రాంతంలో ఉన్న రెండు ప్రార్థనా మందిరాలను కూడా తొలగించే ప్రక్రియ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు. ప్రజల, మత సంస్థల మనోభావాలు దెబ్బతినే చర్యలు తీసుకోవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అక్కడ స్థానికులు ఏర్పాటు చేసుకున్న దేవాలయం తొలగింపు విషయంలో అభ్యంతరాలపై అధికారులను సీఎం చంద్రబాబు వివరణ కోరారు. ప్రార్థనా మందిరాల తొలగింపు విషయంలో సంయమనం పాటించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ముఖ్యమంత్రి సూచనలతో నిన్ననే నిర్మాణాల తొలగింపు ప్రక్రియను నిలిపివేశామని అధికారులు చెప్పారు. ఆయా మతాలకు చెందిన వారి అభిప్రాయలకు విరుద్ధంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి

**పల్నాడు జిల్లా, (రాజధాని వార్తలు):** పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వినుకొండ మండలం శివాపురం వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వ్యవసాయ కూలీలను తరలిస్తున్న బొప్పాయి కాయల లోడు ఉన్న మినీ ట్రాలీని ఎదురుగా వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మొదట ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న సమయంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గ్రామస్తులు, స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఈ ప్రమాదం మంగళవారం ఉదయం జరిగింది. వీరు ప్రకాశం జిల్లాలోని ఎర్రకొండ పాలెం మండలం గడ్డమీద పల్లికి చెందిన వారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. కూలీల కుటుంబాలు కడు పేదరికంతో బాధపడుతున్నాయి. రెక్కాడితే డొక్కాడని పరిస్థితి వారిది. కుటుంబ సభ్యులు మృతిచెందడంతో ఆయా కుటుంబాలు తీవ్రశోకంలో మునిగిపోయాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. లారీ వేగంగా రావడంతోనే ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. వాహనాల రోడ్డు ఫిటెనెస్, డ్రైవర్ లైసెన్స్ విషయాలపై కూడా విచారణ చేపడతామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మృతుల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా కుటుంబాలకు



ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన పరిహారం అందించాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : మంత్రి నారా లోకేష్**

పల్నాడు జిల్లా వినుకొండ మండలం శివాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారికి శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి నారా లోకేష్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## మద్యం స్కాంలో కీలక నిందితుడు అరెస్టు

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు గోవిందప్ప బాలాజీను సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకలోని మైసూరులో అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. మైసూరు కోర్టులో ట్రాన్సిట్ వారెంట్ దాఖలు చేసేందుకు సిట్ బృందాలు ప్రయత్నం చేస్తున్నాయి. గోవిందప్ప బాలాజీ భారతి సిమెంట్స్ డైరెక్టర్. కాగా సుప్రీమ్ కోర్టులో మంగళవారం గోవిందప్ప బాలాజీ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ జరగనుంది.

**మూడు రోజుల క్రితమే నోటీసులు..**

ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులుగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్పలకు మూడు రోజుల క్రితం విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. విజయవాడ సిట్ కార్యాలయానికి వచ్చి విచారణకు సహకరించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. అయితే నిందితులు ఇంత వరకు సిట్ కార్యాలయానికి చేరుకోలేదు. ఇప్పటికే వారి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. సుప్రీంకోర్టు సైతం అరెస్టు నుంచి వీరికి మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది.

**ఈ ముగ్గురు కీలక నిందితులు..**

ఏపీ లిక్కర్ స్కాం కేసులో ఏ 31గా ధనుంజయ రెడ్డి, ఏ 32 కృష్ణ మోహన్ రెడ్డి, ఏ 33 గోవిందప్ప బాలాజీలను సిట్ అధికారులు చేర్చారు. ఇటీవల అరెస్ట్ అయిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య రిమాండ్ రిపోర్ట్‌లో కూడా ఈ ముగ్గురు పేర్లను సిట్ అధికారులు ప్రస్తావించారు. ఈ ముగ్గురి ఆదేశాల మేరకు అప్పట్లో




డబ్బులు వసూలు చేశామని, ఈ డబ్బులు వాళ్ల వద్దకు చేరాయని విచారణలో నిందితులు పేర్కొన్నారు. ఈ రిమాండ్ రిపోర్టు ఆధారంగానే వాళ్ల పేర్లు చేర్చినట్లు మెమోలో సెట్ అధికారులు పేర్కొన్నారు.

**జగన్‌కు అత్యంత సన్నిహితులు..**


కాగా వైఎస్ జగన్‌కు బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అత్యంత సన్నిహితులు. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేయడం, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలతో పాటు ధనుంజయరెడ్డి పాత్ర కీలకం. ముడుపులుగా ఎంత మొత్తం చెల్లించాలనేదానిపై ఈ ముగ్గురూ తరచూ హైదరాబాద్, తాడేపల్లిలో మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల యజమానులతో సమావేశమయ్యేవారని సిట్ అధికారులు ఇప్పటికే నిర్ధారించారు.

## సైబర్ నేరస్తుల కోసం స్పెషల్ ఆపరేషన్




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో సైబర్ నేరస్తుల కోసం టీజీసీఎస్‌బీ స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. 20 మంది సైబర్ నేరస్తులను అరెస్టు చేసింది. సైబర్ క్రిమినల్స్‌కు మ్యూల్ బ్యాంకు ఖాతాలు సరఫరా చేస్తున్న ఏజెంట్లతో పాటు.. సహకరిస్తున్న ముఠాను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అరెస్ట్ చేసింది. మే నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అరెస్ట్ అయిన వారిలో 14 మంది మ్యూల్ ఖాతాదారులు, ఆరుగురు ఏజెంట్లు పట్టుబడిన వారిలో ఉన్నారు. నిందితులపై తెలంగాణలో 60కి పైగా కేసులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 515 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో 27 మ్యూల్ ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా రూ. 44.37 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించారు. తెలంగాణలోనే ఐదుగురు నిందితులు చెక్కుల ద్వారా రూ 22,64,500 విత్ డ్రా చేశారు. నిందితులలో ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, బ్యాంకు ఉద్యోగి ఉన్నారు. వ్యాపారం, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ట్రేడింగ్ పార్ట్ టైం ఉద్యోగాల పేరట మోసాలు జరుగుతున్నాయి. అరెస్ట్ అయిన నిందితుల వద్ద నుంచి 20 మొబైల్ ఫోన్లు, 28 సిమ్ కార్డులు, 4 ఏటీఎంలు, 5 చెక్కు బుక్కులు, రెండు పాన్ కార్డులు, రెండు రబ్బర్ స్టాంపులు, పలు కీలక డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలను అపరిచితులకు తెలియజేయవద్దని, ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌ను లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ సూచించారు.

## బాంబు బెదిరింపు కాల్.. కోల్‌కతా ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్



**కోల్‌కత్తా :** విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు కాల్ రావడంతో కోల్‌కతాలోని నేతాజీ శుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నేడు హైఅలర్ట్ ప్రకటించారు. ముంబైకి వెళ్లనున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్టు గుర్తు తెలియని వ్యక్తం కాల్ చేయడంతో భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమయ్యాయి. ప్రయాణికులందరూ విమానంలో కూర్చున్న తరువాత ఈ కాల్ వచ్చిందని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 1.30గంటలకు విమానం టేకాఫ్ అవ్వాల్సి ఉందని వివరించారు. ఈలోపు బెదిరింపు కాల్ రావడంతో ప్రొటోకాల్ ప్రకారం మొత్తం 195 మంది ప్రయాణికులను కిందకు దింపి విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించినట్టు వివరించారు. “లగేజీలను కిందకు దించాము. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఎయిర్‌పోర్టు అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు” అని అధికారులు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ఎయిర్‌పోర్టులకు ఇలాంటి బెదిరింపు కాల్ రావడం ఇది రెండో సారి. అంతకుమునుపు మే 6న ముంబై ఎయిర్‌పోర్టుకు కూడా ఇలాంటి బెదిరింపు కాల్ వచ్చింది. చండీగఢ్ నుంచి రానున్న ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్టు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి చెప్పారు. ఆ తరువాత తనిఖీల సందర్భంగా అది నకిలీ కాల్ అని తేలింది.

# శ్రీ రామకృష్ణ, వివేకానంద బోధనలు అనుసరణీయం : స్వామి పరిజ్ఞానంద మహారాజ్






**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రతి వ్యక్తి అహంకార మమకారాలు తగ్గించుకొని సహకార గుణం అలవర్చుకోవాలని, దానికి శ్రీ రామకృష్ణ, వివేకానందల బోధనలు అనుసరించాలని స్వామి పరిజ్ఞానంద స్వామి అన్నారు. శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి 66వ వార్షికోత్సవ వేడుకలు సామర్లకోట మండలం పెదబ్రహ్మ దేవం గ్రామంలో సమితి గౌరవాధ్యక్షులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజమండ్రి శ్రీ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞానంద మహారాజ్ పాల్గొని భక్తులకు అభిభాషణ చేశారు. ప్రతి వ్యక్తి కోరికలు తగ్గించుకుంటూ తోటి వారికి సాయం చేసే గుణం అలవర్చుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి తన సంపాదనలో కొంత సమాజ సేవకు ఉపయోగించాలన్నారు. భగవంతుడు నేలపై నడయాడే ప్రతి వ్యక్తిలోనూ ఉన్నాడని పేర్కొంటూ స్వామి వివేకానంద తెలిపినట్లు ఉన్నత విలువలు కలిగి, మానవ సేవే మాధవ సేవగా భరించాలన్నారు. బ్రహ్మశ్రీ ఇంద్రకంటి సత్యనారాయణ మాట్లాడుతూ సమితి ప్రారంభం నుండి నేటికి సేవకుడిగా ఉండటం రామకృష్ణ కృపగా భావిస్తు న్నానన్నారు. త్యాగం, కరుణ, సేవలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో ఆధ్యాత్మిక సేవతో పాటు విద్య, వైద్య రంగాల్లో కూడా సమితి భాగస్వామ్యం కావడం అభినందనీయమని, యువత మరింత అంకిత బావంతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సమితి శాశ్వత కార్యవర్గ సభ్యులు తోటకూర సాయి రామకృష్ణ మాట్లాడుతూ నేటి యువతకు మూర్తి త్రయం రామకృష్ణ పరమహంస, శారదా మాత, వివేకానందల బోధనలు మార్గదర్శకం అన్నారు. ఇతరు లకు సాయం చేయడంలోని అనుభూతి ప్రతి ఒక్కరు పొందాల న్నారు. తొలుత సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ సమితి కార్యకలాపాల నివేదిక, సమితి ఆవిర్భావ నేపథ్యం వివరించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ తోటకూర సూర్యనారా యణ, వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు వింజమూరి విశ్వనాథ శర్మల నిస్వార్థ కృషిని, సేవలను వివరించారు. అనంతరం ఇటీవల పదో తరగతి పరీక్షలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యా ర్థులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి వింజమూరి విశ్వనాద్, సభ్యులు నువ్వుల వెంకట్రాజు, టివివి సత్యనారాయణ, నువ్వుల బాబ్జీ, ఏ సత్యనారాయణ నరసింహారావు, చందవోలు వీర వెంకట సత్యనారాయణ, నువ్వుల సూర్యచంద్రరావు, మండవిల్లి వెంకట్రావు, తోటకూర నాగమణి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# డిసిసిబీ ఛైర్మన్‌కు పలువురు అభినందనలు

## - జనసేన కార్యకర్తల్లో వెల్లివిరిసిన ఆనందం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల డిసిసిబీ చైర్మన్‌గా తుమ్మల రామస్వామి (బాబు) ను నియామిస్తూ కూటమి ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన పార్టీని కష్టకాలంలో ఆదుకొని కొన్నేళ్లుగా పార్టీ కోసం లక్షలాది రూపాయలు సొంత సొమ్ము ఖర్చు చేసి, పొత్తులో భాగంగా పెద్దాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి అవకాశం రాకపోయినా పార్టీకి విధేయ కుడిగా పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని బలపరుస్తూ, పెద్దాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి నిమ్మకా యల చినరాజప్ప గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేసి, అఖండ మెజార్టీ సాధించేలా చేసిన కృషివలుడు తుమ్మల రామ స్వామి అని స్థానిక జనసేన నాయకులు అన్నారు. కార్యకర్తలు, నాయకులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తారని చాటి చెప్పిన ప్రజానాయకుడు తుమ్మల బాబుకు సముచిత స్థానం కల్పిస్తూ డిసిసిబీ చైర్మన్‌గా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎంపిక చేయడం ఆనంద దాయకమన్నారు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలలో కోలాహలంగా మారింది. జనసేన కార్యకర్తలు అందరూ తమకే ఆ పదవి వచ్చినట్లుగా భావించి ఆనందోత్సాహంతో గడిపారు. తండోపతండాలుగా తుమ్మల బాబు ఇంటికి తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి (బాబు) మాట్లా డుతూ జనసేన అధినాయకుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడుగు జాడల్లో నడవడమే తనకు తెలుసునని, ప్రజా సేవకు తన జీవితం అంకితం అన్నారు. తాను ఎంత ఎదిగినా కార్యకర్తనేనన్నారు. ప్రజలకు ఉదయం నుంచి రాత్రి వరకు అందు బాటులో ఉంటూ వారికి సేవ చేయడమే తనకు తెలుసు నన్నారు. రైతులకు న్యాయం చేసేలా తాను కృషి చేస్తానని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి చేస్తున్న కృషికి తన వంతు సహాయంగా పనిచేస్తానన్నారు. కాగా జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున తుమ్మల బాబుకు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

# మిత్రుని కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆదరణ



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, కరప గ్రామానికి చెందిన నడిపిల్లి వీర వెంకట సత్యనారాయణ కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ ఇటీవల మృతి చెందారు. ఈయనకి గతంలో రెండు కిడ్నీలు ఫెయిలయ్యిన సమయంలో అతని తల్లి మాతృ హృదయాన్ని చాటుతూ తన కిడ్నీని దానం చేశారు. తల్లి ప్రేమతో దశాబ్దమున్నరకాలం పాటు సత్యనారాయణ జీవించగలిగారు. అయితే మరలా కిడ్నీలు పని చేయకపోవడంతో ఆయన చికిత్స పొందుతూ ఇటీవల పరమపదించారనే వార్త పూర్వ విద్యార్థులను చలించి వేసింది. ఈ సందర్భంలో కరప మండలం 1990-91 సంవత్సరం పూర్వ విద్యార్థులు తమ మిత్రుని కుటుంబాన్ని ఆర్థి కంగా ఆదుకోవాలని నిర్ణయించుకుని మిత్రుల నుండి రూ. 65,616 సేకరించి బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా అందించారు. ఈ కార్యక్రమానికి పెద్దిరెడ్డి శ్రీరామ్ కృష్ణ, కోనపురెడ్డి వీర్రాజు, పి.ఎస్.ఆర్. కృష్ణ, పెంకే సత్తిబాబు, బండారు గాంధీ, కాకర్లపూడి వర్మ, కడియాల వెంకటరమణ, పలివెల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. సహకరించిన ప్రతి పూర్వ విద్యార్థికి నిర్వాహకుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణ శివారు కోదం డరామపురం గ్రామ సమీపాన కారు విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. సోమవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదంలో ఎవరికి చెప్పుకోదగ్గ ప్రమాదం జరగలేదు. పిఠాపురం వైపు నుండి వస్తున్న కారు సామర్లకోట వైపు అతివేగంగా వస్తూ కోదండరామ పురం వద్ద రోడ్డు ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దానితో విద్యుత్ స్తంభం విరిగి కారు ముందు భాగంపై పడింది. ఢీకొన్న సమయంలో విద్యుత్ స్థంభానికి విద్యుత్ సరఫరా ఉం డటంతో స్థానికులు ప్రమాదాన్ని గమనించి భయాందోళనలతో పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. కారు నడుపుతున్న వ్యక్తి సూరంపాలెం వద్ద గల ప్రముఖ యూనివర్సిటీలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

# సమస్యల పరిష్కరించాలంటూ సిపిఎం ధర్నా




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కాలేజీ నూతన భవనం నిర్మించాలి, పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీళ్లు అందించాలని, మాధవపట్నం ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నూతన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించి ట్రాఫిక్ క్రమబద్ధికరించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ధర్నా కార్యక్రమం నిర్వహించింది. మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి కరణం గోవిందరాజు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని జనాభాకు అనుగు ణంగా మంచినీటిని శుద్ధి చేసే ఫిల్టర్ల స్థాయిని పెంచి అందరికీ రక్షిత త్రాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఎండాకాలంలో రంగు మారిన నీటిని సరఫరా చేయడంతో ప్రజలు అనారోగ్యాలు బారిన పడుతున్నారని, తక్షణం ఉన్నతాధికారులు స్పందించి మంచినీటిని అందించాలని కోరారు. అలాగే సామర్లకోటలో ఉ న్న జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థలో ఉందని తేలికపాటి వర్షాలకు సైతం తరగతి గదులన్నీ తడిచి ముద్ద అవుతున్నాయని, తక్షణం జూనియర్ కళాశాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇంకా మాదవపట్నం రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మించి ట్రాఫిక్కు సమస్య పరిస్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసిల్దార్ గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఎం నాయకులు బాలం శ్రీనివాస్, కరణం ఏడుకొండలు, సైపురెడ్డి యువరాజు, పసుపులేటి వీరబాబు, బాలం హరిబాబు, చరణ్, చల్లా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ మలవిసర్జనపై కలెక్టర్‌కు వినతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట సంగీతరావుపేట అల్లూరి సీతారామరాజు పార్క్ వెనక జరుగుతున్న బహిరంగ మలవిసర్జనను అరికట్టాలని కోరుతూ సోమవారం జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సామర్ల కోటకు చెందిన వీసం వీరనాగు జిల్లా కలెక్టర్ షగిలి షాన్మోహన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మల విసర్జన నిషేధించినప్పటికీ సంగీతరావు పేట ప్రాంతంలో మాత్రం బహి రంగ మల విసర్జన జరుగుతుందని, మరుగుదొడ్డి గోడలు తొల గించకపోవడంతో గోడని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్టు పలుమార్లు స్పందన కార్యక్రమంలో పిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అయితే దానిపై అధికారులు స్పందించలేదని, తాను హైకోర్టుని సైతం ఆశ్రయించగా హైకోర్టు ఇచ్చిన తీర్పును అధికా రులు గౌరవించడం లేదని జిల్లా కలెక్టర్‌కి ఇచ్చిన వినతి పత్రంలో వీరనాగు పేర్కొన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వీరా నాగు కలెక్టర్‌ను కోరారు.

# వైద్య రంగంలో ఆరోగ్య సిబ్బంది, నర్సులు పాత్ర ఎనలేనిది : డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ఎస్ కే ఖాదర్ వలీ





**కోవూరు, (రాజధాని వార్తలు):** వైద్య రంగంలో ఆరోగ్య సిబ్బంది, నర్సులు చేస్తున్న సేవలు కొనియాడదగినవని కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలకు సైతం తెగించి వారు అందించిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయని జిల్లా టీబీ ఎయిడ్స్ నివారణ అధికారి డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఎస్ కే ఖాదరవల్లి తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అంత ర్జాతీయ నర్సులు దినోత్సవం పురస్కరించుకొని పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్పత్రుల పనిచేస్తున్న 18 మంది నర్సులకు మెమెంటో శాలువా గిఫ్ట్‌తో ఘనంగా సత్కరించి సన్మా నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వం సేవ నైపుణ్యం అందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని అంతర్జా తీయ నర్సులు జయంతిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుం దన్నారు. ఆసుపత్రికివచ్చే రోగుల పట్ల అమ్మలాంటి వారి ఆదరణ ఎవరు మరువలేనన్నారు వైద్య రంగంలో వైద్యులు అందించే సేవలకంటే అమ్మలా రోగులను అక్కున చేర్చుకుని ఆదరించే నర్సుల సేవలే ఎనలేనివి అన్నారు డాక్టర్ నరసింహమూర్తి మాట్లాడుతూ తల్లి గర్భంలో నుంచి వచ్చిన శిశువును సురక్షితంగా మాతృమూర్తి ఒడిలోకి చేర్చడంలో నర్సులు చేస్తున్న సేవలకు కొలమానం ఏదీ లేదన్నారు. నాలుగు సంవత్సరాలుగా ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పెద్ది మారుతి నాగార్జున సత్యవతి దంపతులు కుటుంబ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీ యమన్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లీలావతి, కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్, డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, ట్రస్ట్ సభ్యులు వేముల నిఖిల్, పెద్ది హితేష్ కుమార్, తదితరులు ప్రసంగించారు. అంతకుముందు నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

# వేదగిరి నరసింహ స్వామి కొలువులో వేమిరెడ్డి దంపతులు





**నెల్లూరు /కోవూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహ కొండపై వెలసి ఉన్న శ్రీ వేదగిరి నరసింహస్వామికి జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు స్వామికొలువులో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ మర్యాదలతో వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేమిరెడ్డి దంపతు లను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి వేమిరెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు అందచేశారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, నరసింహ స్వామి ఆలయ సేవా కమిటీ సభ్యులు అచ్యుత్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, జెట్టి మదన్ మోహన్ రెడ్డి, ఆవుల వాసు. జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, చప్పిడి శ్రీనివాసులు రెడ్డిస్థానిక టీడీపీ నాయకులు ఆలయ ఈఓ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కోసం హాలీవుడ్ స్టార్‌ని దించేస్తున్నారు!



పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ నటిస్తున్న మరో క్రేజీ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్ ఓజీ. సాహెూ ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. గత కొంత కాలంగా ఈ మూవీ షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. పవన్ కల్యాణ్ ఏపీ రాజకీయాల్లో బిజీగా ఉండటం, ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తుండటంతో ఆయనకు ఖాళీ టైమ్ లభించడం లేదు. దీంతో అంగీకరించిన సినిమాల షూటింగ్‌లు నిరవధికంగా వాయిదా పడుతూ వస్తున్నాయి. ఇదే కారణం వల్ల షూటింగ్ వాయిదా పడుతూ వస్తున్న హరి హర వీరమల్లు షూటింగ్ మళ్లీ మొదలు కావడం తెలిసిందే. ఇదే తరహాలో సుజీత్ తెరకెక్కిస్తున్న ఓజీ షూటింగ్ కూడా తిరిగి ప్రారంభం కాబోతోంది. ఇందులో పవన్ కల్యాణ్ పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించబోతున్నారు. ఈ మూవీ ప్రకటించిన దగ్గరి నుంచి అటు ప్రేక్షకుల్లోనూ, ఇటు అభిమానుల్లోనూ ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే చాలా రోజులుగా ఈ ప్రాజెక్ట్ షూటింగ్ ఆగిపోవడంతో ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇక ఈ ప్రాజెక్ట్ ఆగినట్టేనా అని ఫీలయ్యారు. అయితే వారి ఎదురుచూపులకు తెరదించుతూ టీమ్ గుడ్ న్యూస్ చెప్పింది. మళ్లీ మొదలైంది. ఈ సారి ముగిద్దాం అంటూ త్వరలోనే షూటింగ్ పూర్తి చేస్తామని హింట్ ఇచ్చారు. దీంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఈ మూవీకి సంబంధించిన కీలక అప్ డేట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఓ హాలీవుడ్ స్టార్ ఈ మూవీలో భాగం కాబోతున్నాడు. కిల్ బిల్, గాడ్జిల్లా ఫైనల్ వార్స్ వంటి సినిమాల్లో నటించిన జపాన్ నటుడు కజుకి కిటముర ఓజీలో నటిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఓ కీలక పాత్రలో కజుకి కిటముర కనిపించనున్నారని ఇన్ సైడ్ టాక్. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇమ్రాన్ హష్మీ, శ్రియా రెడ్డి, ప్రకాష్‌రాజ్, అభిమన్యు సింగ్‌కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

వీరికి తోడు జపాన్‌నటుడు కజుకి కిటముర కూడా ఈ ప్రాజెక్ట్‌లో చేరడంతో ఓజీపై క్రేజ్ మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఓటీటీ రైట్స్‌ని భారీ మొత్తానికి నెట్‌ఫ్లిక్స్ దక్కించుకున్న ఈ మూవీని పాన్ ఇండియా వైడ్‌గా తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.


# నందమూరి కుటుంబంలో బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ తప్పితే ఎవరు సక్సెస్ కారా?



తెలుగు చిత్రసీమలో నందమూరి కుటుంబానికి ఉన్న గుర్తింపు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అన్న ఎన్టీఆర్‌తో మొదలైన ఈ ఫ్యామిలీ సినిమా ప్రస్థానం నేటికీ కొనసాగుతోంది. అయితే, ఈ ఫ్యామిలీ నుంచి వచ్చిన వారిలో బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ మాత్రమే ఒక స్పెషల్ స్థాయిలో ఎదిగారు. బాలయ్యకు సంపూర్ణ మాస్ క్రేజ్ ఉంది. అలానే ఎన్టీఆర్‌కి అన్ని వర్గాల్లో అభిమానులున్నారు. ఇద్దరూ పెద్ద ఎన్టీఆర్ వారసత్వాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లారనేది అభిమానులు నిరంతరం గుర్తు చేసుకుంటూ ఉంటారు. సీనియర్ ఎన్టీఆర్ తర్వాత ఫ్యామిలీ ప్రస్థానాన్ని స్ట్రాంగ్‌గా ఉంచి బాలయ్య. అటు రాజకీయాల్లోనూ, ఇటు సినిమాల్లోనూ బలంగా నిలబడ్డారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికొస్తే.. తాత పేరు, గొప్ప కుటుంబ నేపథ్యం ఉండినా, తన స్టైల్‌లోనే ఎదిగాడు. యువహీరోగా సినీ ప్రయాణం ప్రారంభించి ఎన్నో అవరోధాలను ఎదుర్కొన్నాడు. కానీ తానొక నటుడిగా మాత్రమే కాకుండా మాస్, క్లాస్ ప్రేక్షకుల మనసుల్ని గెలిచాడు. ఆరంభంలో ఉన్న కొన్ని అపజయాలను అధిగమించి, ఈరోజు ఆర్ఆర్ఆర్, దేవరలాంటి సినిమాలతో ఇండస్ట్రీలో టాప్ ప్లేస్‌లో నిలవడం ఆయన అంకితభావానికి నిదర్శనం. ఇతర కుటుంబ సభ్యుల విషయంలో చూస్తే, చాలా మంది వచ్చినా పెద్దగా నిలదొక్కుకోలేకపోయారు. కల్యాణ్ రామ్ ఓ మోస్తరు స్థాయిలో సినిమాలు చేస్తూ ఉన్నప్పటికీ, మాస్ లెవల్లో క్రేజ్ కొంత తక్కువ. హరికృష్ణ, అలాగే 3వ తరంలో మరికొందరు కొంత కాలం ప్రయత్నించి రిటైర్ అయ్యారు. ఇప్పుడు జానకిరామ్ కుమారుడు ఎన్టీఆర్ (రామ్) ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఈ తరానికి చాలా కఠినమైన మార్కెట్ ఇది. మొట్టమొదటి సినిమా నుంచే హిట్ కొట్టాలంటే, కంటెంట్ పక్కాగా ఉండాలి. అందుకే దిశానిర్దేశం చేస్తున్న వైవీఎస్ చౌదరి చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు. ఈ నేపథ్యంతో అభిమానుల్లో చర్చకు తావిస్తున్న మరో ఆసక్తికర అంశం ఏమిటంటే.. జానకిరామ్ కుమారుడి డెబ్యూ ఫంక్షన్‌కు జూనియర్ ఎన్టీఆర్ హాజరుకాలేదు. ఇదే విషయాన్ని పలువురు సోషల్ మీడియాలో ప్రస్తావిస్తున్నారు. తారక్ తరచూ తన అన్నయ్య జానకిరామ్ గురించి సానుభూతితో మాట్లాడిన సందర్భాలున్నాయి. అలాంటప్పుడు అతని కుమారుడి తొలి సినిమా ప్రారంభోత్సవానికి రాకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. బహుశా తాను వస్తే అభిమానుల తాకిడి ఎక్కువగా ఉంటుందని గ్రహించి ఉండవచ్చు, లేదంటే ఆర్ఆర్ఆర్ ఈవెంట్ కోసం లండన్ ప్లాన్ ముందుగానే సెట్టవ్వడం వలన రాకపోయి ఉండవచ్చు అనే కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. ఇది ఒక వ్యక్తిగత కారణం కావచ్చునో, లేక పరిస్థితుల కారణంగా ఆలస్యమైందో తెలియదు. కానీ నందమూరి ఫ్యామిలీ అంతర్గత సమైక్యతపై ఫ్యాన్స్‌లో నిత్యం కన్ఫ్యూజన్ ఏర్పడుతూనే ఉంటుంది. అయితే ఎప్పుడూ కొత్త హీరోలకు అవకాశాలు ఇవ్వడంలో టాలీవుడ్ ముందే ఉంటుంది. పేరుంటే చాలు అన్న మద్దతు కాదు. టాలెంట్, కథ, బజ్ అన్నీ కలిసి పనిచేయాలి. బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ ఎందుకు టాప్ స్టార్స్ అయ్యారో, వాళ్లలో ఉన్న కమిట్‌మెంట్, కథల ఎంపిక, హార్డ్ వర్క్ చూసినప్పుడే అర్థమవుతుంది. ఇప్పుడు నాలుగో తరం నుంచి వస్తున్న రామ్‌కు కూడా అదే ప్రూవ్ చేయాల్సిన అవసరం ఉంది. ఫ్యామిలీ లెగసీ ఏదైనా ఉండొచ్చు. కానీ నిలదొక్కుకోవాలంటే ప్రేక్షకుల మనసు గెలవాలి. వైవీఎస్‌కి ఇది మళ్లీ ఓ రీ ఎంట్రీ కూడా. 'సీతారాముల కల్యాణం చూతము రారండి', 'లాహిరీ లాహిరీ లాహిలో', 'దేవదాస్' వంటి బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన ఆయన.. చాలా కాలంగా సినిమా తీయలేదు. ఈ ప్రాజెక్ట్‌తో తనకు గౌరవాన్ని తిరిగి తెచ్చుకోవాలనుకుంటున్నారు. అదేవిధంగా రామ్‌కు కూడా సాలిడ్ ప్లాట్‌ఫామ్ కావాలంటే, ఆడియో, టీజర్ స్టేజ్ నుంచే హైప్ ఉండాలి. తొలి సినిమా హిట్ అయితేనే, నందమూరి ఫ్యామిలీ నుండి మరో స్టార్ ఎదిగినట్లు అభిమానులు భావిస్తారు.

# సమంత కోసం గురూజీ లేడీ ఓరియేంటెడ్!





సమంత హైదరాబాద్ నుంచి ముంబైకి మకాం మార్చేసిన వేళ! దర్శకుడు త్రివిక్రమ్, సామ్ తెలుగు సినిమా లు కూడా చేయాలని...హైదరాబాద్ అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండాలని కోరిన సంగతి తెలిసిందే. సమంత బాలీవుడ్ కెరీర్ పై దృష్టి పెట్టిన నేపథ్యంలో టాలీవుడ్ కి దూరమవుతుందనే ఆలోచనలో భాగంగా గురూజీ అలా వ్యాఖ్యానించారు. అయితే ఇటీవల జరిగిన శుభం ఈవెంట్ లో సామ్ మళ్లి తెలుగు సినిమాలు చేస్తా నని ప్రామిస్ చేసింది. సరైన కథలు కుదరకపోవడంతోనే చేయడం లేదని వివరణ కూడా ఇచ్చింది. శక్తివంతమైన లేడీ ఓరి యేంటెడ్ కథలైతే బాగుంటుంది? అన్నట్లు సామ్ మాటల్లో బయట పడింది. ఈ నేపథ్యంలో తాజాగా సమం త కోసం గురూజీ రంగంలోకి దిగినట్లు ఫిలిం సర్కిల్స్‌లో జోరుగా వినిపిస్తుంది. సమంత కోసం అదిరిపోయే లేడీ ఓరియేంటెడ్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నట్లు సన్నిహితుల నుంచి లీకైంది. ప్రస్తుతం గురూజీ కూడా ఖాళీగానే ఉన్న సంగతి తెలిసిందే. బన్నీతో ప్రాజెక్ట్ అనుకున్నా అది వాయిదా పడటంతో తదుపరి ప్రాజెక్ట్ వెంకటేష్‌తో చేయాలనుకుంటున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే స్టోరీ సిద్దంగా ఉంది. వెంకటేష్ కాల్షీట్లు ఇవ్వగానే పట్టాలె క్కించా లన్నది ప్లాన్. అయితే ఈ గ్యాప్ లోనే సమంత కోసం స్టోరీ పనులు మొదలు పెడుతున్నట్లు సమాచారం. ఇప్పటి వరకూ గురూజీ లేడీ ఓరియేంటెడ్ స్క్రిప్ట్ లు కూడా ఎన్నడు రాయలేదు. కానీ సమంత కోరిక మేరకు ఆ తరహా కథల కోసం కలం పడుతున్నారు. ఇప్పటికే త్రివిక్రమ్ దర్శకత్వంలో సమంత అత్తారింటికి దారేది, సన్నాఫ్ సత్యమూర్తి, అఆలాంటి చిత్రాల్లో నటించిన సంగతి తెలి సిందే. మూడు సినిమాలు మంచి విజయం సాధించినవే.

# స్టార్ హీరోల రిలీజులు గందరగోళంలో!



ఇదే ఏడాది పక్కాగా రిలీజ్ అవ్వాల్సిన స్టార్ హీరోల సినిమాలు చాలా ఉన్నాయి. కానీ వాటి రిలీజ్‌లోనే క్లారిటీ లోపిస్తుంది. ఏ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో అర్దం కాని పరిస్థితి ఏర్పడింది. భారీ అంచనాలున్న సినిమా రిలీజ్‌లపై స్పష్టత లేకపోవడంతో టైర్ –2, టైర్ –3 హీరోల చిత్రాలు ఎప్పుడు రిలీజ్ చేసుకోవాలో వాళ్లకు అర్దం కాని పరిస్థితి ఏర్పడింది. ఓసారి ఆ వివరాల్లోకి వెళ్తే మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న విశ్వంభర జనవరిలో రిలీజ్ అనుకున్నారు. కానీ రిలీజ్ అవ్వలేదు. వాయిదాకి ఎన్నో కారణాలు తెరపైకి వచ్చాయి. చివరిగా తేలింది ఏంటంటే సీజీ వర్క్ ఎక్కువగా ఉండటంతో అనుకున్న టైమ్‌లో ఆ పనులు పూర్తికాక వాయిదా వేసారు. ఇప్పటికీ సీజీ జరుగుతూనే ఉంది. జనవరి తర్వాత మార్చి, ఏప్రిల్ రిలీ అవుతుందన్నారు. అదీ జరగలేదు. కొత్తగా జూన్, ఆగస్టు...అక్టోబర్ అంటూ ప్రచారం మొదలైంది. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న రాజాసాబ్ పరిస్థితి ఇంతే. అదిగో రిలీజ్...ఇదిగో రిలీజ్ అనే ప్రచారం తప్ప రిలీజ్ అవ్వడం జరగలేదు. ఆ సినిమా ఏ స్టేజ్‌లో ఉందో? ఎలాంటి అప్‌డేట్ లేదు.

అలాగే యంగ్ హీరో తేజ సజ్జా మిరాయ్ కూడా రిలీజ్ తేది రివీల్ చేయలేదు. సినిమాకి సంబంధించి అప్ డేట్ కూడా లేదు. ఇంకా అనుష్క ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న ఘాటీ రిలీజ్‌పై స్పష్టత లేదు. చిత్రీకరణ పూర్తయిన యూనిట్ అంతా కామ్‌గా ఉంది. దీంతో బ్యాకెం డ్‌లో ఏం జరుగుతుందో తెలియలేదు. అలాగే మాస్ రాజా రవితేజ మాస్ జాతర మేకర్స్ కూడా సైలెంట్‌గానే ఉన్నారు. రిలీజ్ విషయంలో క్లారిటీ ఇవ్వడం లేదు. ఈ సినిమాల రిలీజ్‌లపై ఓ క్లారిటీ వస్తే తదుపరి సినిమాలు ఎప్పుడు రిలీజ్ డేట్లు వేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

# జర్నలిస్టుల సంక్షేమమే ఫెడరేషన్ లక్ష్యం

## - కూటమి ప్రభుత్వానికి దశల వారీగా వినతులు - అర్హులైన వారికి ఇళ్లస్థలాలు కేటాయించాల్సిందే : జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల

**అక్కయ్య పాలెం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ లు పనిచేస్తున్నాయని జాతీయ జర్నలిస్టుల సంఘం (ఎన్ ఏ జె) కార్యదర్శి గంట్ల శ్రీను బాబు పేర్కొన్నారు. జర్నలిస్ట్‌ల సంక్షేమం కోసం తమ వంతు పని చేస్తాయన్నారు. మంగళవారం అక్కయ్య పాలెం జంక్షన్ ప్రాంగణంలో ఉన్న ఒక ప్రైవేట్ హొటల్‌లో నిర్వహించిన సంఘం కార్య వర్గ సమావేశంకు గంట్ల శ్రీనుబాబు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు, అక్రిడేషన్లు సదుపాయం కల్పించాలని అలాగే ప్రమాధ భీమా పథకాన్ని తిరిగి పునరుద్దరించాలని కూటమి నాయకులకు దశల వారీగా తమ రాష్ట్ర, జాతీయ యూనియన్ లు వినతిపత్రాలు అందజేశాయన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఆయా అంశాలకు సంబంధించి తాను కూడా ఇటీవల పలు సందర్భాల్లో వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఆయా





సమస్యలను కూటమి ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని ఎదురు చూస్తున్నామన్నారు. జర్నలిస్ట్‌లు సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 29న విశాఖ వేదికగా ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుంది అన్నారు. అందులో పలు తీర్మానాలు చేసి మరోసారి కూటమి దృష్టికి తీసుకు వెళతామన్నారు. విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం నియమించిన అన్ని కమిటీల్లోనూ ప్రభుత్వం పాత్రికేయులకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. అలాగే ఉమ్మడి విశాఖలో ఈ ఏడాది తమ యూనియన్‌లలో సుమారు 800 మంది జర్నలిస్ట్‌లు సభ్యులుగా చేరినట్లు చెప్పారు. నిరంతరం జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు పాటుపడుతున్నామన్నారు.

**అవార్డు గ్రహీతలకు సత్కారం**

ఇటీవలే దేశోద్దారక, స్వాతంత్ర సమర యోధుడు, మహాద్మి గాంధీ మన్న నలు పొందిన కాశీనాధుడు నాగేశ్వరరావు పంతులు పేరిట విశ్వ దాత అవార్డు స్వీకరించిన జాతీయ జర్నలిస్ట్‌ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబును, మాజీ రాష్ట్రపతి జానీ జైల్ సింగ్ పురస్కారాలు పొందిన కె విశర్మ, మధురవాడకు చెందిన ఆనంద్‌లను కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంకు ఫెడరేషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఏ.సాంబశివరావు ఆర్గనైజింగ్ సెక్రటరీలు ధవలేశ్వరపు రవికుమార్,పితాని సూర్యప్రసాద్, ఉపాధ్యక్షులు శివప్రసాద్,ఎన్ రామకృష్ణ కృష్ణమూర్తి నాయుడు, సంయుక్త కార్యదర్శులు గొడబ రాంబాబు, రవిశంకర్, రాజశేఖర్, నగేష్ బాబు మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రంగధామం, మధురవాడ యూనిట్ ప్రతినిధి ఆనంద్ ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కింతాడ మదన్, అసోసియేషన్ ప్రతినిధులు మళ్ల త్రినాధ్, నెలరాజు స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ ఎస్ జగన్మోహన్, కార్యదర్శి శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు పూతి వెంకట రెడ్డి, కోశాధికారి కేవీ శర్మ, సంయుక్త కార్యదర్శులు బీ ప్రసాద్, రాజశేఖర్, కార్యనిర్వాహక సభ్యుడు జగన్ పాల్గొన్నారు.

# పేదలను ఆర్థికంగా ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి

## - కశింకోట మండలం, కన్నూరు పాలెం గ్రామ టీడీపీ కమిటీ ఎన్నిక - నూతనంగా ఎన్నికైన గ్రామ మరియు బూత్ కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం - సీఎం సహాయ నిధి చెక్కును లబ్దిదారులకు అందజేసిన రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ





**కశింకోట, (రాజధాని వార్తలు):** కశింకోట మండలం, కన్నూరుపాలెం గ్రామంలో ఇటీవల సీఎం సహాయ నిధి నుండి మంజూరు అయిన 500280/- రూపాయల మొత్తాన్ని చెక్కు నెంబర్ 276683 ద్వారా లబ్ధిదారుడు అక్కెరపు వెంకట రమణ కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రైవేటుగా వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికి సీఎం సహాయ నిధి ఇస్తున్నారని అన్నారు. అనంతరం జరిగిన టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలలో కన్నూరు పాలెం 1.చుక్క ప్రసాద్ (పార్టీ ప్రెసిడెంట్), 2. కుంద్రపు కన్నం నాయడు ( వైస్ ప్రెసిడెంట్), 3. కూంద్రపు పైడిరాజు (జనరల్ సెక్రటరి), 4. నెమ్మది రమేష్ (ఆర్గనైజింగ్ సెక్రటరీ), 5. కర్రి నానాజి (ఆర్గనైజింగ్ సెక్రటరీ, 6. ఎద్దు కృష్ణ (ఆర్గనైజింగ్ సెక్రటరీ, 7. మర్రా రాజు (ట్రెజరర్), 8. చుక్క కన్నం నాయుడు (సెక్రటరీ), 9.



కొమ్మోజు శ్రీను, (10. రెడ్డి దేముళ్ళు, 11. చీపురుపల్లి నాయుడు (సోషల్ మీడియా కన్వీనర్), తెలుగు మహిళా 1) కన్నూరు. అక్కియమ్మ (ప్రెసిడెంట్), (2) జాగారపు ఈశ్వరమ్మ (జనరల్ సెక్రటరి), తెలుగు యువత పైల వెంకట రమణ (ప్రెసిడెంట్), వర్రీ శ్రీను (జనరల్ సెక్రటరీ)లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




# త్వరితగతిన 100 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి

**పాడేరు, (రాజధాని వార్తలు):** పాడేరులో ఆదివాసి స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ. గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులకు మరియు జిసిసి చైర్మన్‌కి 5వ షెడ్యూల్ ఏరియాలో ఆదివాసులకు 100% ఉద్యోగాలు ఇవ్వాలంటూ ఆదివాసులకు సీఎం ఇచ్చిన హామీ త్వరితంగా నెరవేర్చడానికి కృషి చేయాలంటూ తెలియ పరచడం జరిగింది.

# గౌతమ బుద్ధుని బోధనలు అందరికీ మార్గదర్శకాలు

## - లయన్స్ క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ ఉర్లం శివతేజ

**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** గౌతమ బుద్ధుని బోధనలు అందరికీ మార్గదర్శకాలని లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ ఛైర్పర్సన్ ఉర్లం శివతేజ మంగళవారం అన్నారు. గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా ఉర్లం. శివతేజ మాట్లాడుతూ గౌతమ బుద్ధుని బోధనలు ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వినాలని, ఆయన జీవిత చరిత్రలో శాంతి, అహింసా, స్త్రీ, సత్యాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారన్నారు. బుద్ధుని బోధనలు వింటే జీవితంలో ఎలా బ్రతకాలో అర్ధమౌతుందని, అందరూ ఆయన పాటించే ఐదు సూత్రాలను తెలుసుకుని ఆచరిస్తే తప్పక మనలో సత్ప్రవర్తన, సేవా రూప నియమావళితో జీవిస్తామన్నారు. పరులకు సహాయ పడటం గొప్ప విషయమని, బౌద్ధం స్వేచ్ఛ, సమానత్వం అత్యున్నత విలువనిచ్చిందని, కుల, మత రహిత సమసమాజ స్థాపనకు పూనుకొని దాన్ని ఆచరణలో పెట్టి భారతదేశ సమాజానికి ఆదర్శ ప్రాయంగా నిలిచిందన్నారు. బౌద్ధంలో స్త్రీకి అత్యున్నతమైన విలువ, గౌరవం, స్వేచ్ఛను కల్పించింది. ఇలాంటి బౌద్ధం భారత దేశ సమాజానికే కాదు యావత్ ప్రపంచ వర్తమాన, భవిష్యత్తుకు ఒక గొప్ప దార్శనికంగా ఆదర్శప్రాయంగా ఉంటుందన్నారు.



# పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో శ్రీ రామదేవ వ్యాయామ సంఘం విజయం




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** 11.5.2025 న ఆదివారం, స్థానిక అనకాపల్లి జార్జి క్లబ్‌లో జరిగిన జిల్లా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో శ్రీ రామదేవ వ్యాయామ సంఘం జిమ్ తరపున పాల్గొన్న మా క్రీడా కారులు విశేష ప్రతిభ కనబరిచి పలు బహుమతులు గెలుచుకున్నారు. విజేతల వివరాలు: గుమ్మాల భాను ప్రసాద్ - 53 కేజీల విభాగం - గోల్డ్ మెడల్, కోడూరు జగన్నాథం - 61 కేజీల విభాగం - గోల్డ్ మెడల్, ఇల్లపు గణేష్ - 93 కేజీల విభాగం - గోల్డ్ మెడల్, చింత జయంత్ - 83 కేజీల విభాగం - సిల్వర్ మెడల్, సబ్బవరపు శ్రావణ కుమార్ - 72 కేజీల విభాగం - సిల్వర్ మెడల్, టెక్కలి శ్రీనివాస్ - మాస్టర్స్ 71 కేజీల విభాగం - గోల్డ్ మెడల్, సంజయ్ బాబు - 110 కేజీల విభాగం - గోల్డ్ మెడల్, శ్రీకాకుళపు స్వరూప్ - 70 కేజీల విభాగం - గోల్డ్ మెడల్, 83 కేజీల విభాగం - సిల్వర్ మెడల్ (పేరు సూచించబడలేదు). ఈ విజేతలు అంతర్జాతీయ మెడలిస్ట్ జాజుల రామలక్ష్మి శిక్షణలో మెడల్స్ సాధించారు. సంఘ అధ్యక్షులు ఉగ్గిన అప్పారావు మాట్లాడుతూ, ఈ పోటీల్లో భాగంగా ఐదుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి సెలెక్షన్‌కు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అతిథిగా హాజరైన గొర్లి శేఖర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలుగా మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రతిరోజూ వ్యాయామం చేసి మంచి ఫలితాలు సాధించి, ప్రభుత్వ ఉద్యోగం దాకా వెళ్లేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పెదిరెడ్ల రమేష్, జాయింట్ సెక్రటరీ ఉగ్గిన శివ, క్యాషియర్ వెదుళ్ళ నూకేష్, సమ్మర్ కోచింగ్ క్యాంప్ కోచ్ ఉగ్గిన శ్రీను, గుమ్మాల చిన్నారి, జిమ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయు భవనం నిర్మాణం పూర్తి

## - అధికార సేవల ప్రారంభం కోసం ఎదురు చూపులు

**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** మండలంలోని మారు మూల ప్రాంతమైన బలపం పంచాయతీ పరిధిలోని కోరుకొండ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సచివాలయ భవనం పూర్తి కావడం గ్రామస్తుల్లో ఆనందాన్ని కలిగిస్తోంది. నూతనంగా నిర్మించిన ఈ భవనం వైభవంగా ముస్తాబు అయ్యి, అధికార సేవల ప్రారంభానికి కసరత్తులు పూర్తి అయ్యాయి. ఈ భవనం ప్రారంభమైతే పంచాయతీ పరిపాలన మరింత సులభతరం అవుతుందని, ప్రభుత్వ సేవలు తక్షణమే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని గ్రామస్తులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. రికార్డుల భద్రత, పారదర్శక పరిపాలన, ప్రజలకు ప్రత్యక్ష సేవలు అందించేలా ఈ సచివాలయం గ్రామ అభివృద్ధిలో మైలురాయిగా నిలవనుందని స్థానిక పెద్దలు పేర్కొన్నారు. ప్రస్తుతం భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ అధికారుల నుంచి ఆరంభ తేదీ ఖరారు కాకపోవడంతో గ్రామస్తులు నిరాశతో ఎదురు



చూస్తున్నారు. అధికార యంత్రాంగం తక్షణ స్పందన కనబర్చాలని, ఏర్పాట్లు పూర్తయిన సచివాలయ భవనాన్ని త్వరితగతిన ప్రారంభించాలని కోరుకొండ గ్రామ ప్రజలు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. గ్రామ అభివృద్ధి మార్గంలో మరో కీలక అడుగు ముందుకు వేసేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# 50 మంది ఎన్‌సిసి క్యాడెట్స్ శిక్షణకు ఎంపిక

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఏవిఎన్ కాలేజీ విశాఖపట్నంలో 13-05-25 నుండి 23-05-25 వరకు జరుగు NCC ATC-1 CAMP కు జివిఎంసి గవరపాలెం హైస్కూల్‌కి చెందిన 50 మంది ఎన్‌సిసి క్యాడెట్స్ శిక్షణకు ఎంపికయ్యారని ఎన్‌సిసి అధికారి కాంద్రేగుల జనార్ధనరావు, ప్రధానోపాధ్యాయులు ఎ.సూర్య నారాయణ తెలిపారు. ఎన్‌సిసి అధికారి జనార్ధన్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1957 లో 3(A) నావెల్ యూనిట్ ఎన్‌సిసి ప్రారంభించారని నాటి నుండి నేటి వరకు వేలమంది విద్యార్థులు ఎన్‌సిసిలో శిక్షణ పొంది ఎన్‌సిసి సర్టిఫికెట్ ద్వారా రాష్ట్ర, కేంద్ర సంస్థల్లో ఉన్నత విద్యా అభ్యసించుటకు, ఉద్యోగాలు పొందారని తెలిపారు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ వీరికి రెండు సంత్సరాలు ట్రైనింగ్ ఉంటదని తరువాత పరీక్ష పెట్టి A సర్టిఫికెట్ ఇస్తారని ఈ సర్టిఫికెట్ ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు




జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.నారాయణ రావు, పి.కృష్ణ కిషోర్, పి.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan